

కవ్వింపు చర్యలు!
అధికార బెత్తం పట్టుకొని ఓ సామాజిక వర్గాన్ని అక్కడ అణగదొక్కారు. వారందర్నీ ద్వితీయ శ్రేణి పౌరులుగా గుర్తిస్తూ తాము చెప్పిందే వేదం అన్నట్లుగా వ్యవహరించారు.
- 8లో



ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి
ప్రజలు సమర్పించే ఫిర్యాదులను పరిశీలించి వాటిని సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు.
- 8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
36.4 /28.0
జిల్లాలో సోమవారం 28.0 - 36.4 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 9.1 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

నాఫెడ్‌కు భూమి కేటాయింపు

మైదుకూరు : కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ నాఫెడ్‌కు ప్రభుత్వం భూమి కేటాయించింది. ఆ మేరకు కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ మైదుకూరు తహసీల్దార్ రాజసింహ నరేంద్రకు ఆదేశాలు ఇచ్చారు. మైదుకూరులో సర్వే నంబర్లు 1124/1 ఏలో 2.10 ఎకరాలు, 1124/2 బీలో 2.24 ఎకరాలు, 1125/1 ఏలో 0.25 ఎకరాలు, 1125/2 బీ2లో 0.49 ఎకరాలను మొత్తం 5.08 ఎకరాలను కేటాయిస్తున్నట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు. కాగా ప్రభుత్వం కేటాయించిన భూమిలో నాఫెడ్ రైతుల కోసం గోదాములు నిర్మించనున్నారు.

నేటి నుంచి చేపలవేట నిషేధం

గోపవరం : జూలై 1 నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు సోమశిల ప్రాజెక్టు వెనుకజలాల్లో చేపలవేట నిర్వహించకూడదని బ్రాహ్మణ పల్లె సచివాలయ మత్స్యశాఖ అసిస్టెంటు కొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. జూలై, ఆగస్టు మాసాలలో చేపలు గుడ్లు పెట్టే సమయం కావడంతో చేపలవేట నిర్వహించకూడదన్నారు. నిషేధ సమయంలో వేట కొనసాగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

సమ్మె జయప్రదం చేయాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్: ఈ నెల 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జిల్లాలో జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు జి వేణుగోపాల్, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బి మనోహర్, యూటీయూసీ నాయకులు సుబ్బరాయుడు టీయూసీ నాయకులు రమణయ్య పిలుపునిచ్చారు. సోమవారం నగరంలోని హోచిమిన్ భవన్‌లో సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని కోరుతూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ సమ్మె చేపడుతున్నట్టు తెలిపారు. బీజేపీ మూడోసారి అధికారం చేపట్టిన తర్వాత కార్మిక చట్టాలన్నింటినీ రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొస్తున్నారని, లేబర్ కోడ్‌లు అమలు చేస్తే కార్మికులు తమ సమస్యలపై నిరసన కూడా తెలియజేసే అవకాశం కోల్పోతారని ఆందోళన వ్యక్తం చేశారు. పలు యూనియన్ నాయకులు పాల్గొన్నారు.

అధికారం అండగా..
అడ్డగోలుగా భూ దందా

- 250 ఎకరాల భూమిని ఆక్రమించిన టీడీపీ నేతలు
- ఆ భూముల్లో ఉపాధి నిధులతో పండ్ల తోటల ఏర్పాటు
- వాగులు, వంకలను సైతం వదలని వైనం
- పదేళ్లకే ఫ్రీ హోల్డ్ చేసిన అధికారులు



వంక పోరంబోకు భూములు ఆక్రమించుకుని సాగు చేస్తున్న పంటలు



వంకపోరంబోకు భూముల్లో ఉపాధి నిధులతో మామిడి మొక్కలు నాటిన దృశ్యం



వంక పోరంబోకులో పండ్ల తోటల పెంపకానికి ఉపాధి నిధులు మంజూరు చేసిన వివరాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : అధికారం తమదే అని తెలుగుదేశం పార్టీ నాయకులు భారీ భూ దందాకు తెరతీశారు. జిల్లాలోని మారుమూల మండలమైన కలసపాడు మండలంలో 250 ఎకరాలకుపైగా ప్రభుత్వ భూములను ఆక్రమించారు. దర్జాగా కంచెలు వేసి అక్రమ పద్ధతుల్లో వ్యవసాయ కనెక్షన్లు పొంది బోగస్ పట్టాలతో ఉపాధి హామీ పథకం నిధులను నొక్కేస్తున్న విషయం మండల పరిధిలోని ఈ.రామాపురం పంచాయతీలో వెలుగు చూసింది. ఈ.రామాపురం గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు చేసిన భూ దందా గురించి మండల రెవెన్యూ అధికారులు ఏ మాత్రం పట్టించుకోకపోవడంతో వారి ఆక్రమణలకు అడ్డు అదుపు లేకుండా పోయింది. అర్హత కలిగిన రైతులకు పండ్ల తోటల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాల్సిన ఉపాధి హామీ పథకం అధికారులు అడ్డగోలుగా వాగులు, వంకలు బోగస్ పట్టాల లబ్ధిదారులకు నిధులు మంజూరు చేశారు. దీంతో ప్రభుత్వం ఆధీనంలో ఉండాల్సిన భూములు తెలుగు తమ్ముళ్ల పరమై ప్రభుత్వ నిధులతో పండ్ల తోటలుగా భూములను అభివృద్ధి పరచుకుంటున్నారు. ఈ.రామాపురం పంచాయతీకి చెందిన ఎస్‌కేబీ నాయబ్ రసూల్, షేక్ షబానా, పర్వీన్ సుల్తానా పేర్ల మీద సర్వే నంబర్లు 83, 313, 314, 308లో 26 ఎకరాల భూ కబ్జాలకు పాల్పడ్డారు. గంగాయపల్లె రెవెన్యూ గ్రామ పొలం సర్వే నంబర్లు 263, 271, 227, 226, 248 లలో 42 ఎకరాల భూమిని రెడ్డిపల్లెకు చెందిన ఓ నాయకుడు నేరుగా కబ్జా చేశాడు. రెడ్డిపల్లె గ్రామ రెవెన్యూ పొలం సర్వే నంబర్లు 79, 84, 85, 86లలో 52 ఎకరాల ఈ.రామాపురం గ్రామానికి చెందిన తెలుగు తమ్ముళ్లు భూ కబ్జాలకు పాల్పడ్డారు. గంగాయపల్లె గ్రామ రెవెన్యూ పొలంలో 157 ఎకరాల వాగు పోరంబోకు ఉంది.. అందులో గంగాయపల్లెకు చెందిన ఓ యువ నాయకుడు 100 ఎకరాలు కబ్జా చేసి సాగు చేసుకుంటున్నాడు.

ఇష్టారాజ్యంగా నిర్మాణాలు

ఇష్టారాజ్యంగా తెలుగు తమ్ముళ్లు ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేపట్టారు. జిల్లా సరిహద్దు ప్రాంతం కావడంతో ప్రధాన రహదారికి దగ్గరగా ప్రభుత్వ భూములు ఉండటంతో కబ్జా రాయుళ్లు అక్రమంగా భూములను ఆక్రమించి వాటిల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసుకుని ఫాం హౌస్‌లు ఏర్పాటు చేసుకుంటున్నారు. కబ్జా చేసిన భూముల చుట్టూ కంచెలు నిర్మించుకున్నారు.

అధికారుల చర్యలు ఏవీ..

ఈ.రామాపురం గ్రామ పంచాయతీలో తెలుగు తమ్ముళ్ల భారీ భూ ఆక్రమణలపై మండల పరిషత్ అధ్యక్షురాలు బోధనబోయిన నిర్మలాదేవి మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. చర్యలు తీసుకోవాల్సిన రెవెన్యూ అధికారులు పట్టీ పట్టనట్టుగా వ్యవహరిస్తుండటంతో పెద్ద మొత్తంలో ముడుపులు ముట్టినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

ఉపాధి నిధులతో పండ్ల తోటల పెంపకం

వాగు, వంక పోరంబోకు భూముల్లో తెలుగు తమ్ముళ్లు ఉపాధి నిధులను మంజూరు చేయించుకుని పండ్ల తోటలను సాగు చేస్తున్నారు. ఉపాధి ఐడీ నంబర్ 19187011438323, 19187011438340, 19187011438740, 19187011438751, 19187011438752 ఐడీలలో షేక్ బాలాయపల్లె పెద్ద రసూల్, నాయబ్ రసూల్, మహబూబ్ పీరా, షబానా, సాయి యోగేశ్వర్ తదితర పేర్లతో ఉపాధి హామీ పథకం నిధులు అధికారులు మంజూరు చేసి అక్రమార్కులకు సహకరించారు. డీకేటీ పొలాలకు సంబంధించి 20 సంవత్సరాలకు ఫ్రీ హోల్డ్ కావాల్సిన భూములు నిబంధనలకు విరుద్ధంగా 10 ఏళ్లకే రెవెన్యూ అధికారులు ఫ్రీ హోల్డ్ చేసినట్లు తెలుస్తోంది.

ట్రిపుల్ ఐటీలో అడ్మిషన్లు షురూ

తొలి రోజు 481 మందికి అడ్మిషన్లు



తొలి అడ్మిషన్ పొందిన విద్యార్థినికి ప్రవేశ పత్రంతో పాటు బహుమతులను అందిస్తున్న డైరెక్టర్, తదితరులు

వేంపల్లె : రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాయలం పరిధిలోని ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీలో సోమవారం విద్యార్థులకు అడ్మిషన్ల ప్రక్రియ నిర్వహించారు. డైరెక్టర్ ఏవీఎస్ కుమారస్వామి గుప్తా, పరిపాలన అధికారి రవికుమార్, డీన్ అకడమిక్ రమేష్ కైలాస్ ప్రారంభించారు. అన్నమయ్య జిల్లా వీరబల్లి మండలం పెద్దవీడు గ్రామానికి చెందిన బి.మేఘన తొలి అడ్మిషన్ పొందగా.. సత్యసాయి జిల్లా బుక్కపట్నం గ్రామానికి చెందిన బి.హరీష్ రెండవ అడ్మిషన్, కర్నూలు జిల్లా దేవనకొండ మండలం అలారుదిన్నె గ్రామానికి చెందిన బి.మహేశ్వరి మూడవ అడ్మిషన్ పొందారు. మొదటి, మూడు ర్యాంకుల విద్యార్థులకు ప్రవేశ పత్రాలతోపాటు బహుమతులు ప్రదానం చేశారు.

8 కౌంటర్లు.. ఉదయం 6 గంటలకే ఇడుపులపాయ ఆర్కేవ్యాలీ ట్రిపుల్ ఐటీ ఎంట్రెన్స్ విభాగంలో ఉన్న రాజీవ్ సర్కిల్ వద్ద ముందుగా వచ్చిన విద్యార్థులకు టోకన్లను అందజేశారు. వివిధ దశలలో స్క్రీనింగ్ చేయడానికి 8 ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేశారు.

- తొలి రోజు 538 మందికి అడ్మిషన్లు పిలవగా, 481 మంది హాజరై అడ్మిషన్లను పొందారు. ట్రిపుల్ ఐటీ పరిపాలన అధికారి రవికుమార్, ఫైనాన్స్ అధికారి కోటేశ్వరి, అధికారులు లింగమూర్తి, రాఘవరెడ్డి, తిరుపతిరెడ్డి, రఫి, జ్ఞాన వెంకట్, నవీన్, పవన్ కుమార్, ఆనంద్, శ్రీకాంత్ రెడ్డి తదితరులు అడ్మిషన్ ప్రక్రియలో పాల్గొన్నారు.
- మంగళవారం రోజు మరో 500 మంది విద్యార్థులకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నారు. జూలై 15వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయని డైరెక్టర్ తెలిపారు.

ప్రజాస్వామ్యానికి ‘కూటమి’ తూట్లు

ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి



ప్రజల సమస్యలను తెలుసుకుంటున్న ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి

పులివెందుల : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం ప్రజాస్వామ్యానికి తూట్లు పొడుస్తోందని కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం స్థానిక భాకరాపురంలోని తన స్వగృహంలో ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచి కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామిలను తుంగలో తొక్కి కక్ష సాధింపు రాజకీయాలకు తెరలేపిందన్నారు. సాక్షాత్తూ ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న చంద్రబాబు నాయుడు పార్టీలకతీతంగా ప్రజలకు సేవ చేయాల్సిందిపోయి.. ఎట్టి పరిస్థితులలోనూ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలకు పనిచేయవద్దని బహిరంగంగా చెప్పారని గుర్తు చేశారు. తమ ప్రభుత్వంలో పార్టీలకతీతంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని పేర్కొన్నారు. పార్టీలనేవి కేవలం ఎన్నికల వరకేనని తర్వాత ప్రజలందరూ ప్రజాస్వామ్య ప్రభుత్వంలో భాగమేనని గట్టిగా నమ్మిన నాయకుడు వైఎస్ జగన్ అని కొనియాడారు. అనంతరం ఆయన ప్రజా దర్బార్ నిర్వహించారు.

ఉపాధి హామీ పథకం నిర్వీర్యం

కూటమి ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తున్నారని ఎంపీ అవినాష్‌రెడ్డి విమర్శించారు. సోమవారం కొంతమంది ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు ఎంపీని కలిశారు. తమను అకారణంగా తొలగిస్తున్నారని ఆయన దృష్టికి తెచ్చారు. దీనిపై ఎంపీ మాట్లాడుతూ ఈ ప్రభుత్వంలో ఉపాధి హామీ పథకం ఉనికి కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. ఆ పథకంలో అవినీతికి అంతు లేకుండా పోయిందని.. కూలీలతో చేయించాల్సిన పనులను మిషన్ల ద్వారా కొద్ది గంటలు మాత్రమే చేయించి బిల్లులు చేసుకుంటున్నారని ఆరోపించారు. ఫీల్డ్ అసిస్టెంట్ల తొలగింపుపై న్యాయ పోరాటం చేస్తామని వారికి భరోసా ఇచ్చారు.

వ్యవస్థలను దిగజారుస్తున్న ప్రభుత్వం

కూటమి ప్రభుత్వం వ్యవస్థలను దిగజారుస్తోందని ఎంపీ మండిపడ్డారు. ఇటీవల పులివెందులలో టీడీపీ తోరణాలు తొలగించారన్న కారణంతో మైనర్ బాలురులపై పోలీసులు హత్యాయత్నం కేసు పెట్టడాన్ని తప్పుబట్టారు. బెయిల్‌పై వచ్చిన మైనర్ బాలురు, వారి కుటుంబ సభ్యులు ఎంపీని కలిశారు. ఈ సందర్భంగా ఎంపీ వారితో మాట్లాడుతూ పిల్లలు చదువుపై దృష్టి సారించాలని, మీకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. టీడీపీ నాయకులు పోలీసుల ద్వారా మైనర్ బాలుర్లపై అక్రమ కేసు పెట్టడం నీచమైన చర్య అని మండిపడ్డారు. ఇలాగే అక్రమ కేసు ఎదుర్కొన్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్‌తోపాటు ఇతర నాయకులకు ఆయన మనో ధైర్యం చెప్పారు. అన్ని విధాలుగా పార్టీ అండగా ఉంటుందన్నారు.

అయ్యో దేవుడా..ఎంతపనిచేశావయ్యా..



చెన్నామర్రి వద్ద హృదయ విదారక దృశ్యం

కురబలకోట : అన్నమయ్య జిల్లా కురబలకోట మండలం చెన్నామర్రి మిట్ట వద్ద సోమవారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదం పెను విషాదాన్ని మిగిల్చింది. కర్ణాటక రాష్ట్రం బాగేపల్లెకు చెందిన మూడు కుటుంబాల వారు డ్రైవర్‌తో కలిపి 15 మంది తిరుమల దైవ దర్శనానికి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ట్రావెల్ టెంపోలో స్వగ్రామానికి వస్తుండగా మండలంలోని చెన్నామర్రి వద్ద ఎదురుగా వచ్చిన కంటైనర్ లారీ ఢీకొనడంతో ఈ ఘోరం జరిగింది. మేఘర్స్ (16), చరణ్ (17), శ్రావణి (24) అక్కడికక్కడే విగత జీవులుగా మారారు. మరో పది మంది తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో నరసింహారెడ్డి (49), రూప (40) ఆదర్స్ (19), రామంద్రప్ప (45), కళావతి (40), దర్శన్ (16), శివప్ప(42), సునందమ్మ (38) చైత్ర (19) తోపాటు ట్రావెల్ టెంపో డ్రైవర్ మంజునాథ (42) ఉన్నారు. ఆర్తనాదాలు, విలాపాలతో సంఘటన స్థలం శోకతప్తమైంది. విషాదంతో కర్నాటకలోని బాగేపల్లె, కొత్త ఉడుంపల్లె గొల్లు మన్నాయి. పెనుప్రమాదం సంభవించడంతో కురబలకోట, మదనపల్లె ప్రాంతాలు ఒక్కసారిగా ఉలిక్కి పడ్డాయి. మృతి చెందిన ముగ్గురి మృత దేహాలను మదనపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహించారు. గాయపడిన వారిని 108 వాహనం, పోలీసు వాహనంలో తరలించారు. డ్రైవర్ మంజునాథ తీవ్రంగా గాయపడడంతో మాట్లాడలేని పరిస్థితిలో ఉన్నారు. నరసింహారెడ్డి, శివప్ప కుటుంబాలకు చెందిన వారిని మెరుగైన వైద్యం కోసం కర్నాటక రాష్ట్రంలోని వివిధ ఆసుపత్రులకు తరలించారు. ఇదిలా ఉండగా ట్రావెలర్ టెంపోను ఢీకొని వెళ్లిపోయింది కంటైనర్ లారీగా గుర్తించారు. వాహనంతో పాటు డ్రైవర్ కోసం పోలీసులు గాలిస్తున్నారు.

టాప్‌తో సహా లేచిపోయింది

ట్రావెలర్ టెంపో జరిగిన ప్రమాదం చూస్తే గుండెలు తరుక్కుపోతాయి. ట్రావెలర్ టెంపో డ్రైవర్ పక్కగా ఎదురుగా వచ్చిన లారీ ఢీకొట్టడంతో అటు వైపు ఉన్న వారు ముగ్గురు చనిపోగా పది మంది తీవ్రంగా గాయపడ్డారు. లారీ వేగంగా ఢీ కొట్టడంతో టెంపో ట్రావెలర్ వాహనం టాప్ ఏమాత్రం లేకుండా లేచిపోయింది. సీట్లలోనే తీవ్ర గాయాలతో అంగలార్చడం చలింపజేసింది. మరికొందరు చెల్లా చెదురుగా రోడ్డుపై పడిపోయారు. సంఘటన స్థలం రక్తసిక్తమంది. పోలీసులు సకాలంలో స్పందించారు. స్థానికులు కూడా సహాయక చర్యలతో మానవత్వాన్ని చాటుకున్నారు.

ఒక్కో కుటుంబంలో ఒక్కరు..

మండలంలోని చెన్నామర్రి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక్కో కుటుంబానికి చెందిన ఒకరు మృతి చెందడం కలవరాన్ని కల్గిస్తోంది. బాగేపల్లె నుండి నరసింహారెడ్డి, రామచంద్రప్ప, శివప్ప కుటుంబాల వారు తిరుమల యాత్ర వెళ్లారు. నరసింహారెడ్డి కుటుంబంలో అతని కుమారుడు మేఘర్స్ (16), రామచంద్రప్ప కోడలు శ్రావణి (24), శివప్ప కుటుంబం నుండి చరణ్ (17) మృతి చెందారు. వీరిలో శ్రావణికి ఐదేళ్ల క్రితం వివాహమైంది. మిగిలిన వారు విద్యార్థులు.

అదృష్టవంతులు

ప్రమాదానికి గురైన ట్రావెలర్ టెంపో డ్రైవర్ మంజునాథ పక్క సీట్లో బాగేపల్లెకు చెందిన అశోక్ (32) కూర్చున్నాడు. ఇతని వెనుక సీట్లో బాగేపల్లె దగ్గరున్న ఎ. కొత్తపల్లెకు చెందిన ఏడో తరగతి విద్యార్థి హేమంత్ కూర్చున్నారు. ఇతను ఒక్కడే తిరుమల గుండు చేయించుకున్నారు. వీరు డ్రైవర్‌కు ఎడమ పక్కన సీట్లలో ఉండడం వల్ల పెను ప్రమాదం నుండి తప్పించుకున్నారు. 15 మందిలో వీరిద్దరికి రక్త గాయాలు కాలేదు. అంత ప్రమాదంలో వీరు బతికి బట్టకట్టడం అదృష్టమేనని చెబుతున్నారు.

క్లుప్తంగా

చెట్టు విషయమై గొడవ

పులివెందుల రూరల్ : పట్టణంలోని స్థానిక కడప రోడ్డులో ఉన్న హెచ్‌పీ గ్యాస్ గోడౌన్ సమీపంలో పవన్ కుమార్ రెడ్డి, సందీప్ రెడ్డి, సరస్వతి దేవి, శివ శంకర్ రెడ్డిలు ఇంటిలోని ప్రహరీ వద్ద చెట్టు విషయమై గొడవపడ్డారు. టెంకాయ చెట్టుకు సంబంధించి ఆకులు, టెంకాయ వేర్లు ఇంటిలోకి వచ్చి గోడ కూలిపోతుందని సరస్వతి దేవి, శివ శంకర్ రెడ్డిలు పవన్ కుమార్ రెడ్డి, సందీప్ రెడ్డిలతో గొడవకు దిగారు. దీంతో వీరి మధ్య మాటా మాటా పెరిగి పరస్పరం కొట్టుకున్నారు. ఈ ఘటనలో సరస్వతి దేవి, శివశంకర్ రెడ్డి లకు గాయాలయ్యాయి. వీరిని చికిత్స కోసం ప్రభుత్వ సర్వజన ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం కడపకు తరలించారు. అలాగే పవన్ కుమార్ రెడ్డి, సందీప్ రెడ్డిలకు కూడా గాయాలు కావడంతో ప్రభుత్వ సరజన ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నారాయణ తెలిపారు.

గుప్త నిధుల కోసం తవ్వకాలు



పాత తాళ్లప్రొద్దుటూరు గ్రామంలో శివలింగం చుట్టూ తవ్విన దృశ్యం

కొండాపురం : మండల పరిధిలోని పాత తాళ్లప్రొద్దుటూరు గ్రామంలోని శివాలయంలో ఆదివారం రాత్రి గుప్త నిధుల కోసం గుర్తు తెలియని వ్యక్తులు తవ్వకాలు చేపట్టినట్లు స్థానికులు తెలిపారు. గండికోట జలాశయంలో ముంపునకు గురైన గ్రామాల్లో ఆలయాల్లో గుప్త నిధులు ఉంటాయని దొంగలు టార్గెట్ చేస్తున్నారు. పాత తాళ్లప్రొద్దుటూరు లోని శివాలయం గుడిలో శివ లింగం చుట్టు తవ్వకాలు చేపట్టడంతో సోమవారం మండల తహసీల్దార్ గుర్రప్ప, స్థానిక పోలీసులు పరిశీలించారు. ముంపు గ్రామాల్లో జనసంచారం లేకపోవడంతో పురాతన ఆలయాల్లో తవ్వకాలు జరుపుతున్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కవ్వింపు చర్యలు!

- పోట్లదుర్తిలో హైటెన్షన్
- మద్యంషాపు వద్ద స్వల్ప వాదులాట
- రెచ్చగొట్టే దాడికి పాల్పడిన సురేష్‌నాయుడు వర్గీయులు
- ఆపై పోట్లదుర్తిలో ఉద్రిక్తత.. పరస్పర రాళ్లదాడులు
- సకాలంలో స్పందించిన పోలీసు బలగాలు

సాక్షి ప్రతినిధి, కడప : అధికార బెత్తం పట్టుకొని ఓ సామాజిక వర్గాన్ని అక్కడ అణగదొక్కారు. వారం దర్నీ ద్వితీయ శ్రేణి పౌరులుగా గుర్తిస్తూ తాము చెప్పిందే వేదం అన్నట్లుగా వ్యవహరించారు. ఇటీవల గ్రామ దేవత పెద్దమ్మ ఆలయం ప్రాంగణం మొత్తానికి ప్రహరీ నిర్మించాలని వారు పట్టు బట్టారు. చేస్తున్న తప్పును తప్పు అన్నందుకు వివక్ష మరింత అధికమైంది. ఆపై అధికార మదం తోడైంది. ఫలితంగా వెంటవెంటనే కవ్వింపు చర్యలు తెర పైకి వస్తున్నాయి. క్రమం తప్పకుండా వాదులాటలు చోటుచేసుకుంటున్నాయి. ఈ క్రమంలోనే ఆదివారం అర్ధరాత్రి పోట్లదుర్తిలో పరస్పర రాళ్లదాడులు తెర పైకి వచ్చాయి. పోలీసులు సకాలంలో స్పందించడంతో కాస్తా ఉపశమనం దక్కినా ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి.

ఎర్రగుంట్ల మండల పరిధిలోని పోట్లదుర్తి గ్రామంలో హైటెన్షన్ నెలకొంది. తాగుబోతుల మధ్య నెలకొన్న స్వల్ప వాదులాట చిలికి చిలికి గాలి వాన లాగా మారి రెండు సామాజిక వర్గాల మధ్య పెద్ద వివాదంగా మారింది. పరస్పరం రాళ్ల దాడులు చేసుకునే వరకూ వెళ్లింది. వైన్ షాపులో మద్యం సేవిస్తున్న ఇరువురు ఆ తర్వాత ఖాళీ బాటిల్‌ను వెనుకకు వేశారు. ఆ వైపు ఉంటూ మద్యం సేవిస్తున్న మరో ముగ్గురు బాటిల్ మా వైపు ఎందుకు వేశారంటూ గొడవ పడ్డారు. చూడకుండా చేసిన పొరపాటును సీరియస్‌గా తీసుకోవద్దని అక్కడి వారు సర్ది చెప్పారు. అంతటితో వదిలేసి ఉంటే సరిపోయేది. ఊర్లో మీ కథ పెద్దదైంది. మీకు దిక్కున్నచోట చెప్పుకోండంటూ పరుష పదజాలంతో దూషణలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు మొదలయ్యాయి.

సురేష్‌నాయుడుపై తిరుగుబాటు..

వైన్ షాపులో చోటుచేసుకున్న వివాదం పోట్లదుర్తి గ్రామంలో సీఎం సురేష్‌నాయుడు ఇంటిపై తిరుగుబాటుగా మారింది. ఎంతకాలం మీ దౌర్జన్యాలను భరించాలంటూ మరో సామాజిక వర్గం ఆదివారం అర్ధరాత్రి తర్వాత సురేష్‌నాయుడు ఇంటిపై రాళ్ల దాడులు చేశారు. ఈ క్రమంలో పరస్పర రాళ్ల దాడులు తెరపైకి వచ్చాయి. సుమారు గంట పాటు సురేష్‌నాయుడు ఇంటి సమీపంలో రాళ్ల దాడులు



పోట్లదుర్తిలో ఆదివారం అర్ధరాత్రి తిష్టవేసిన పోలీసులు

చోటుచేసుకున్నాయి. గ్రామస్థుల సమాచారం మేరకు ఎర్రగుంట్ల పోలీసులు సకాలంలో గ్రామానికి చేరుకొని ఉద్రిక్తతలను శాంతింపజేశారు. ఇరువర్గాలతో సంప్రదింపులు జరిపి తాత్కాలిక ఉపశమనం కల్పించారు. కవ్వింపు చర్యల కారణంగా ఉత్పన్నమైన ఘర్షణ రెండు సామాజిక వర్గాలకు అంటుకుంది. దీనికి కారణం.. తమకు అడ్డు లేదు అనుకున్న సందర్భంలో పెద్దమ్మ దేవాలయం ప్రాంగణానికి మొత్తం ప్రహరీ నిర్మించాలని కొందరు పట్టుబట్టడమే. వెరసి ఇలాంటి వివాదాలు తరచూ తెరపైకి వస్తున్నాయని పలువురు వివరిస్తున్నారు. అధికారులు వారి విధులను పైరవీలకు తలొగ్గకుండా నిబద్ధతతో నిర్వర్తిస్తే ఇలాంటివి ఉత్పన్నం అయ్యే అవకాశం లేదు. ప్రశాంత వాతావరణం ఉన్న గ్రామాల్లో సమస్యలకు మూల కారకులుగా అధికారులు మారుతుండటం గమనార్హం. పోట్లదుర్తిలో పోలీసు పికెట్ కొనసాగుతున్నా వ్యవహారం నివురు గప్పిన నిప్పులా ఉందని పరిశీలకులు చెబుతున్నారు. ఇప్పటికైనా నిక్కచ్చిగా వ్యవహరించి కవ్వింపు చర్యలకు ఆస్కారం లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి

జాయింట్ కలెక్టర్ అదితిసింగ్



ప్రజల అర్జీలను పరిశీలిస్తున్న జేసీ అదితిసింగ్

కడప సెవెన్‌రోడ్స్ : ప్రజలు సమర్పించే ఫిర్యాదులను పరిశీలించి వాటిని సకాలంలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో నిర్వహించిన గ్రీవెన్స్‌సెల్‌లో ఆమె అర్జీలు స్వీకరించి వాటి పరిష్కారం కోసం ఆయా శాఖల అధికారులకు పంపారు.

■ తమ కుమారులు తమ వద్ద ఉన్న డబ్బు, బంగారం, స్థలాలు తీసుకుని తమను పోషించకుండా వదిలేశారని కడప విజయదుర్గ కాలనీకి చెందిన కుప్పం లక్ష్మినారాయణశ్రేష్టి ఫిర్యాదు చేశారు. వృద్ధులమైన తాను, తన భార్య జీవించడం కష్టంగా ఉందన్నారు. తామిచ్చిన స్థలాలు తమకు ఇప్పించి ఆదుకోవాలని కోరారు.

■ వికలాంగులు, వృద్ధులు, ఒంటరి మహిళలకు ఇంటి వద్దకే వెళ్లి బియ్యం పంపిణీ చేయాలని ప్రభుత్వం ఆదేశించినప్పటికీ డీలర్లు ఇవ్వడం లేదని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు చిన్న సుబ్బయ్య యాదవ్, కార్యదర్శి సుబ్బారావు ఫిర్యాదు చేశారు.

■ ఎస్సీ, బీసీ కార్పొరేషన్ల ద్వారా నిరుద్యోగులకు రుణాలు మంజూరులో జాప్యం తగదని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వీరనాల శివకుమార్ అన్నారు. దరఖాస్తులు స్వీకరించి బ్యాంకుల ద్వారా ఇంటర్వ్యూలు కూడా నిర్వహించారని, తర్వాత అర్హుల జాబితా విడుదల చేయలేదని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ఇన్‌ఛార్జి డీఆర్వో వెంకటపతి, డ్వామా పీడీ ఆదిశేషారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ రాజ్యలక్ష్మి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి ఆర్థిక పరిపుష్టి

జిల్లాలో ప్రతి కుటుంబానికి ఆర్థిక పరిపుష్టి చేకూర్చే కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని జాయింట్ కలెక్టర్ అదితిసింగ్ పేర్కొన్నారు. సంతృప్తికరమైన ఆర్థిక పరిపుష్టిపై మూడు నెలలపాటు జిల్లాలో క్యాంపెయిన్ నిర్వహిస్తారన్నారు. ఇందుకు సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రిత్వశాఖ, బ్యాంకింగ్ రంగం ప్రచురించిన పోస్టర్లను సోమవారం కలెక్టరేట్ సభా భవనంలో జేసీ ఆవిష్కరించారు. జిల్లాలో ఆర్థిక అక్షరాస్యతను పెంపొందించడం, బ్యాంకింగ్ యాక్సెస్ విస్తరించడం, డిజిటల్ లావాదేవీలను ప్రోత్సహించడంతోపాటు విస్తృతంగా నైపుణాభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేయాల్సి ఉంటుందని ఈ సందర్భంగా ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తోపాటు బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

శివారెడ్డి ఆకస్మిక మరణం పౌర సమాజానికి తీరని లోటు



శివారెడ్డి(ఫైల్)

కడప వైఎస్ఆర్ సర్కిల్/ కడప అర్బన్ : నిరంతరం శ్రమజీవుల పక్షాన, అంతరాలు లేని సమాజం కోసం పరితపించిన, కపటం లేని ప్రముఖ సామాజిక కార్యకర్త, సీహెచ్ఆర్‌డీ స్వచ్ఛంద సంస్థ వ్యవస్థాపకుడు పుత్తా శివారెడ్డి(65) ఆకస్మిక మరణం పౌర సమాజానికి తీరని లోటని పలువురు రాజకీయ, సామాజిక, అభ్యుదయ, స్వచ్ఛంద సంస్థల నేతలు పేర్కొన్నారు. సోమవారం ఉదయం గుండెపోటుతో ఆకస్మికంగా మరణించిన శివారెడ్డి భౌతికకాయానికి నగరంలోని బాలాజీ నగర్‌లోని ఆయన నివాసంలో సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు చంద్ర, చంద్రశేఖర్ పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజల కోసం శక్తికి మించి శివారెడ్డి పని చేశారన్నారు. సమాచారం పొందడం ప్రజల హక్కు అని రహస్యాలు లేని పరిపాలన కోసం సమాచార హక్కు చట్ట రక్షణకు కృషి చేశారన్నారు. రాజకీయాలకతీతంగా ప్రజాతంత్ర ఉద్యమాలలో భాగస్వామ్యం అయ్యేవారన్నారు. ఎన్నికల్లో అక్రమాలు అరికట్టేందుకు ఎన్నికల నిఘా వేదికలో సభ్యులుగా తమ వంతు పాత్ర నిర్వహించేవారన్నారు. రిమ్స్‌లో శివారెడ్డి మరణించిన కొద్ది



సామాజిక కార్యకర్త శివారెడ్డి భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న పలు సంఘాల నేతలు

సమయంలోనే వారి కుటుంబ సభ్యులు ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్ కు నేత్రదానం చేశారు. శివారెడ్డి భౌతికకాయాన్ని మంగళవారం ఉదయం రిమ్స్ మెడికల్ కాలేజీ వైద్య విద్యార్థుల పరిశోధనల కోసం దేహ దానం చేసేందుకు కుటుంబ సభ్యులు అంగీకారం తెలిపారు. నివాళులర్పించిన వారిలో సీపీఐ నగర కార్యదర్శి యస్ వెంకట శివ, హేతువాద సంఘం నాయకులు సిఆర్వీ ప్రసాద్, నాగార్జున రెడ్డి, విరసం వరలక్ష్మి, శ్రీనివాసుల రెడ్డి, ప్రజానాట్యమండలి, నాస్తిక సంఘం నేత పల్లవోలు రమణ, లోక్‌సత్తా శ్రీకృష్ణ, ఆప్ నేత డాక్టర్ శ్రీనివాసులు, రాయలసీమ ఎస్సీ ,ఎస్టీ మానవ హక్కుల వేదిక నాయకులు జేవీ రమణ, రిటైర్డ్ అధికారులు గోపాల్, ఫణిరాజు తదితరులు ఉన్నారు.

ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయండి

జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్

కడప అర్బన్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు వచ్చిన ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేయాలని జిల్లా ఎస్పీ ఈ.జి. అశోక్ కుమార్ పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం 'ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని జిల్లా ఎస్పీ నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి వారి సమస్యలపై అక్కడికక్కడే సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్ చేసి సదరు ఫిర్యాదులపై చట్టపరంగా చర్యలు తీసుకునేలా ఆదేశాలు జారీ చేశారు. సుదూర ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులకు పోలీసు సిబ్బంది ప్రశాంతంగా తమ సమస్యను వివరించడానికి సహాయం చేశారు. ఈ కార్యక్రమంలో డి.టి.సి డీఎస్పీ అబ్దుల్ కరీం, మహిళా పోలీసు స్టేషన్ డీఎస్పీ బాలస్వామి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఫిర్యాదుదారులతో ముఖాముఖి మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ ఈజీ అశోక్‌కుమార్

మహిళా పోలీసు కౌన్సెలింగ్‌లో నిబంధనలకు పాతర

జేసీకి మహిళా సంరక్షణ కార్యదర్శుల ఫిర్యాదు



జేసీని కలిసేందుకు వచ్చిన మహిళా సంరక్షణ కార్యదర్శులు

కడప సెవెన్‌రోడ్స్ : సచివాలయాల్లో పనిచేసే మహిళా సంరక్షణ కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్‌లో ఉన్నతాధికారులు నిబంధనలకు పాతర వేశారని పలువురు మహిళా పోలీసులు సోమవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏపీ విలేజ్ అండ్ వార్డు సెక్రటేరియేట్ మహిళా పోలీసు వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షురాలు ఉమాదేవి, కార్యదర్శి కె.సత్యకుమారి, దీప్తి మాధురిలు మాట్లాడుతూ ఆదివారం జిల్లా పోలీసు కార్యాలయంలో 646 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారన్నారు. కౌన్సెలింగ్ ప్రక్రియ పారదర్శకంగా లేదన్నారు. నిబంధనలు పాటించకుండా కేవలం స్పౌజ్‌కే ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా జీఓ నెంబరు 6ను ఉల్లంఘించారని ఆరోపించారు. మెడికల్, పీహెచ్ వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వలేదని తెలిపారు. కౌన్సెలింగ్ జాబితా కూడా ముందుగా నోటీసు బోర్డులో ప్రదర్శించలేదని చెప్పారు. ఒకే స్టేషన్‌లో పనిచేస్తున్న వారు, వేరే మండలాల నుంచి కూడా పనిచేస్తున్న వారు కడప యూఎల్‌బీలో పోస్టింగ్ తీసుకున్నారని వివరించారు. ఇందువల్ల మెరిట్ జాబితాలో ఉన్న వారికి తీవ్ర అన్యాయం జరిగిందని తెలిపారు. కౌన్సెలింగ్ సమయంలో అన్ని సచివాలయాల పేర్లు చూపించలేదన్నారు. స్పౌజ్ కేటగిరీ కింద 14,215 ర్యాంకు వచ్చిన వారికి కూడా మొదటి ప్రాధాన్యత ఇవ్వడం ఏ మేరకు న్యాయమంటూ ప్రశ్నించారు. కౌన్సెలింగ్ రద్దుచేసి నిబంధనల ప్రకారం పారదర్శకంగా రీ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీకి జీతాలు పెంచాలి

వేంపల్లె : ఆర్జీయూకేటీ పరిధిలోని ట్రిపుల్ ఐటీలో పనిచేస్తున్న కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ ఉద్యోగులకు జీతాలు పెంచాలని కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ గెస్ట్ అసోసియేషన్ నాయకుడు నజీర్ హుస్సేన్ కోరారు. సోమవారం విజయవాడలో ఉన్న రాష్ట్ర మంత్రి పార్థసారథిని కాంట్రాక్టు టీచింగ్ ఫ్యాకల్టీ గెస్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు కలిసి జీతాలు పెంచాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2018లో జాయిన్ అయిన కాంట్రాక్టు గెస్ట్ ఫ్యాకల్టీకి ఉద్యోగంలో చేరే సమయంలో రూ.25 వేలు ఇచ్చారని, కాంట్రాక్టు ఫ్యాకల్టీగా 7 ఏళ్ల నుంచి ఉద్యోగం చేస్తున్నా ఇప్పటివరకు ఆర్జీయూకేటీ పైసా కూడా జీతం పెంచలేదన్నారు. తమ తర్వాత ఎంపికైన అభ్యర్థులకు అసిస్టెంట్ ప్రొఫెసర్ స్థాయి ఇచ్చారన్నారు. కూటమి ప్రభుత్వం కాంట్రాక్టు ఫ్యాకల్టీని గుర్తించి జీతాలు పెంచి శాశ్వత పరిష్కారం చేసేందుకు సమాన పనికి సమాన వేతనమైనా ఇప్పించాలని కోరారు.

కడప-నెల్లూరు ఏసీఏ అండర్-19 మల్టీ డే మ్యాచ్‌లు ప్రారంభం



74 పరుగులు చేసిన నెల్లూరు బ్యాట్స్‌మెన్ తోషిత్ యాదవ్



4 వికెట్లు తీసిన కడప జట్టు బౌలర్ చరణ్



108 పరుగులు చేసిన అనంతపురం బ్యాట్స్‌మెన్ రిహాన్




4 వికెట్లు తీసిన అనంతపురం బౌలర్ టీవీ సాయి ప్రతాప్ రెడ్డి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : ఏసీఏ అండర్-19 మల్టీ మ్యాచ్‌లు ప్రారంభమయ్యాయి. తొలి రోజు సోమ వారం కేఓఆర్ఎం క్రికెట్ మైదానంలో కడప, నెల్లూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచిన కడప జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్ ప్రా రంభించిన నెల్లూరు జట్టు 69.3 ఓవర్లకు 232 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆ జట్టులోని తోషిత్ యాదవ్ 116 బంతుల్లో 74 పరుగులు, ఇకాషర్ 44 పరుగులు చేశారు. కడప జట్టులోని చరణ్ 4 వికెట్లు, నాగ కుళ్లాయప్ప 2 వికెట్లు, ధీరజ్ కుమార్ రెడ్డి 2 వికెట్లు తీశారు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన కడప జట్టు 18 ఓవర్లకు 3 వికెట్లు నష్టపోయి 129 పరుగులు చేసింది. ఆ జట్టులోని గురు విఘ్నేష్ 53 పరుగులు, రణధీర్ రెడ్డి 47 పరుగులు చేశారు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

వైఎస్ఆర్ఆర్ ఏసీసీ స్టేడియంలో..

వైఎస్ఆర్ స్టేడియంలో జరిగిన మరో మ్యాచ్‌లో అనంతపురం-చిత్తూరు జట్లు తలపడ్డాయి. ముందుగా టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న చిత్తూరు జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 44 ఓవర్లకు 189 పరుగులు చేసి ఆలౌట్ అయింది. ఆ జట్టులోని సాయి చరణ్ 55 పరుగులు, లోహిత్ లక్ష్మీ నారాయణ 33 పరుగులు చేశారు. అనంతపురం జట్టులోని టీవీ సాయి ప్రతాప్‌రెడ్డి అద్భుతంగా బౌలింగ్ చేసి 4 వికెట్లు తీశాడు. వరుణ్ సాయి నాయుడు 3 వికెట్లు తీశాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన అనంతపురం జట్టు 39 ఓవర్లకు 5 వికెట్లు కోల్పోయి 179 పరుగులు చేసింది. ఆ జట్టులోని రిహాన్ చక్కటి లైనప్‌తో బ్యాటింగ్ చేసి 103 బంతుల్లో 108 పరుగులు చేశాడు. హమీమ్ 38 పరుగులు చేశాడు. చిత్తూరు జట్టులోని సాయి చరణ్ 3 వికెట్లు, మంజునాథ్ 2 వికెట్లు తీశారు. దీంతో తొలి రోజు ఆట ముగిసింది.

ఉత్సాహంగా త్రోబాల్ పోటీలు



అండర్-17లో విన్నర్స్‌గా నిలిచిన హైదరాబాదు పబ్లిక్ స్కూల్ విద్యార్థులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడప నగర శివార్లలోని ది హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో ఆంధ్రప్రదేశ్ బీ-జోన్ , సీఐఎస్‌సీఈ ఆంధ్రప్రదేశ్ - తెలంగాణ జోనల్ త్రోబాల్ టోర్నమెంట్ ఉత్సాహంగా సాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అంతర్జాతీయ త్రోబాల్ క్రీడాకారుడు డి. రేవంత్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడలు, క్రమశిక్షణ, జట్టు సమన్వయం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తాయని తెలిపారు. ఈ పోటీల్లో విజేతలుగా -అండర్-17 విభాగంలో హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ కడప , ద్వితీయ స్థానంలో శ్రీ వేద ఇంగ్లీష్ మీడియం స్కూల్ మదనపల్లి,

అండర్-14 విభాగంలో విజేతలుగా స్విస్ రిఫరల్ హాస్పిటల్ స్కూల్ పలమనేరు, రన్నరప్ లు హైదరాబాద్ పబ్లిక్ స్కూల్, కడప, మూడవ స్థానం స్టెమ్ పబ్లిక్ స్కూల్, గుంటూరు నిలిచాయి. పాఠశాల ప్రిన్సిపాల్ అమిత్ సింగ్ ఈ పోటీల్లో విజయం సాధించిన జట్లను అభినందించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాసమూర్తి, రహమతుల్లా, వ్యాయామ ఉపాధ్యాయులు, కోచ్‌లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చెన్నేపల్లిలోనే పాఠశాల కొనసాగించాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థులు, తల్లిదండ్రులు

కడప సెవెన్‌రోడ్స్ : అట్లూరు మండలం చెన్నేపల్లె ప్రాథమిక పాఠశాలను అక్కడే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఆ గ్రామస్తులు, విద్యార్థులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మూడవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు ఎస్.వెంకటాపురం పాఠశాలలోకి తరలించాలన్న నిర్ణయాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. 1 నుంచి 5వ తరగతి వరకు చెన్నేపల్లెలోనే కొనసాగించాలన్నారు. అనంతరం జేసీ అదితిసింగ్‌కు వినతిపత్రం సమర్పించారు.

సగిలేరు పాఠశాలను తరలిస్తే ఆందోళన చేపడతాం



ధర్నా నిర్వహిస్తున్న విద్యార్థి, యువజన సంఘాల నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : బి.కోడూరు మండలం సగిలేరు గురుకుల పాఠశాలను బ్రహ్మంగారిమఠం లోని మహా గురుకుల పాఠశాలకు తరలిస్తే జిల్లా వ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామని వివిధ విద్యార్థి, యువజన సంఘాల నాయకులు హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన ధర్నాలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జి.వలరాజు, ఏఐఎస్‌బీ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు రాహుల్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంకన్న, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి శివకుమార్ మాట్లాడుతూ సగిలేరు గురుకుల పాఠశాలను యధావిధిగా అక్కడే కొనసాగించాలని డిమాండ్ చేశారు. 1983లో ఏర్పడిన సగిలేరు గురుకుల పాఠశాలకు ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు. అలాంటి పాఠశాలను బి.మఠంలోని తోట్లపల్లె వద్ద ఉన్న మహా గురుకులంలో విలీనం చేయాలని భావించడం తగదన్నారు. ఇప్పటికైనా అధికారులు తమ నిర్ణయాలను మార్చుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాగరాజు, ఏపీపీఏ నాయకుడు భాస్కర్, ఏఐఎస్‌బీ రాయలసీమ కన్వీనర్ రాజేంద్ర, ఎస్ఎఫ్ఐ నాయకుడు అజయ్ తదితరులు పాల్గొన్నారు.

బాలింత మృతిపై విచారణ



గుండంరాజుపల్లె ఎస్టీ కాలనీలో విచారిస్తున్న డీఎంహెచ్ఓ

బద్వేలు అర్బన్ : తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి చికిత్స కోసం వచ్చి బాలింత మృతి చెందిన ఘటనపై సోమవారం జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.నాగరాజు విచారణ చేపట్టారు. ఇందులో భాగంగా తొట్టిగారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, గుండంరాజుపల్లె ఎస్టీ కాలనీలో సందర్శించి వివరాలు సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో కాన్పులు చేయడం చాలా ప్రమాదకరమని, ఎలాంటి శిక్షణలేని మంత్రసానులు ఇళ్లల్లో సొంతంగా కాన్పులు చేయకూడదని తెలిపారు. ప్రతి కాన్పు ఆసుపత్రిలోనే జరగాలని, గర్భిణులను ఆసుపత్రులకు తీసుకొని వెళ్లేందుకు 108 ఉపయోగించుకోవాలని సూచించారు. గర్భిణులకు, చిన్న పిల్లలకు సరైన సమయంలో మెరుగైన వైద్యం అందించి మాత శిశు మరణాలు లేకుండా చూడాల్సిన బాధ్యత వైద్యాధికారులు, సిబ్బంది పైన ఉందన్నారు. అనంతరం ప్రజాసంఘాల నాయకులు, మృతురాలి బంధువులను అడిగి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ ఏ. ఉమామహేశ్వరరావు, డీఎంహెచ్ఓ కార్యాలయ సిబ్బంది ఖాజామొహిద్దీన్, డాక్టర్ రాజేష్ కుమార్, డాక్టర్ వినయ్ కుమార్, హెల్త్ ఎడ్యుకేటర్ వెంగయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, అంగన్వాడి సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాఫిక్ సిగ్నల్స్ స్తంభాన్ని ఢీకొట్టిన లారీ

బద్వేలు అర్బన్ : పట్టణంలోని నాలుగురోడ్ల కూడలిలో ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ స్తంభాన్ని ఆదివారం అర్ధరాత్రి ఓ లారీ ఢీ కొట్టింది. ఈ ఘటనలో మైదుకూరు రోడ్డు వైపున ఉన్న ట్రాఫిక్ సిగ్నల్స్ స్తంభంతో పాటు ట్రాఫిక్ సిగ్నల్స్ ధ్వంసమయ్యాయి. రేణిగుంట నుండి బద్వేలు మీదుగా గోపవరం సమీపంలోని సెంచూరి పరిశ్రమకు కలప లోడుతో వెళుతున్న లారీ నాలుగురోడ్ల కూడలిలోకి వచ్చేసరికి మలుపు తిప్పుకుంటూ ట్రాఫిక్ సిగ్నల్స్‌ను ఢీ కొట్టింది. విషయం తెలుసుకున్న అర్బన్ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి ప్రమాదానికి కారణమైన లారీని స్టేషన్‌కు తరలించారు. లారీ డ్రైవర్ నిర్లక్ష్యం కారణంగానే ప్రమాదం జరిగినట్లు గుర్తించారు.